ప్రజావాణిలో రాజీవ్ గృహకల్ప వాసుల నిరసన


డిప్యూటీ కమిషనర్ నరసింహ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రాజీవ్‌గృహకల్ప వాసులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సూరారం రాజీవ్ గృహకల్ప సంక్షేమ సంఘం అధ్యక్షుడు శివ గౌడ్ ఆధ్వర్యంలో స్థానికులు నిరసన తెలిపారు. గృహకల్ప సముదాయంలో అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించే వరకు కదిలేది లేదని బైఠాయించారు. అనంతరం ఉప కమిషనర్ నరసింహ హామీతో విరమించారు. అదే విధంగా సర్కిల్ కార్యాలయంలో పెన్షన్ సిబ్బందిని నియమించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకుడు గుబ్బల లక్ష్మీనారాయణ, భ్రమరాంబ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కొన్ని నెలలుగా పెన్షన్ సెక్షన్‌లో సిబ్బంది లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని వారిని నియమించాలని కోరారు. ప్రజావాణిలో మొత్తం 16 ఫిర్యాదులు రాగా వాటిలో ఎనిమిది టౌన్ ప్లానింగ్, మూడు ఇంజినీరింగ్, శానిటేషన్ రెండు విభాగాలకు సంబంధించిన మూడు ఫిర్యాదులు స్వీకరించారు.

శ్రావణం సందర్భంగా కావడి యాత్ర


షాపూర్‌నగర్‌లో భక్తులతో బీజేపీ నేత భరతసింహారెడ్డి


ఉమామహేశ్వర ఆలయం వద్ద ..

సుభాష్‌నగర్: శ్రావణమాసం మొదటి రోజు సందర్భంగా బీహార్, ఒడిస్సా రాష్ట్ర భక్తులు సోమవారం పెద్ద ఎత్తున కావడి యాత్ర నిర్వహించారు. ముందుగా కుత్బుల్లాపూర్‌లోని వివిధ ప్రాంతాల నుంచి షాపూర్‌నగర్‌కు తరలివచ్చి అక్కడి నుంచి కాలినడకన సూరారంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి గంగాజలంతో శివునికి అభిషేకాలు చేశారు. వీరికి ఆలయ వ్యవస్థాపకుడు ముద్దాపురం మదన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. కావడి యాత్ర భక్తులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతకుముందు షాపూర్‌నగర్‌లో ప్రారంభమైన యాత్రలో బీజేపీ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం


కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎం అశోక్

చింతల్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని, ఎక్కడికి వెళ్లినా విధులు సక్రమంగా నిర్వర్తించాలని కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం అశోక్ అన్నారు. వాటర్‌వర్క్స్ కార్యాలయానికి కొత్తగా వచ్చిన డీజీఎంలు రవి, వికాస్ సీనియర్ ఆఫీసర్ అశోక్ కుమార్, సూరారం సెక్షన్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన ఈశ్వరయ్యకు సోమవారం ఆయన స్వాగతం పలికి సన్మానించారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయం నుంచి బదిలీపై వెళ్లిన సీనియర్ ఆఫీసర్ విజయ రాధిక, రెవెన్యూ ఆఫీసర్ రామచందర్, పీఅండ్‌ఏ సత్యనారాయణ, టీఓ రాములు, సీనియర్ అసిస్టెంట్ లాలప్ప, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, లైన్‌మెన్‌కు వీడ్కోలు పలికారు. డీజీఎం రాజేశ్, సెక్షన్ల మేనేజర్లు, ఎలక్ట్రికల్ మేనేజర్, కార్యాలయ సిబ్బంది, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఆరు ఫిర్యాదులు..

జలమండలిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం ఆరు ఫిర్యాదులు వచ్చాయి. చింతల్ సెక్షన్ నుంచి మూడు, జీడిమెట్ల సెక్షన్ నుంచి రెండు, జీడిమెట్ల శిక్ష నుంచి మరో ఫిర్యాదు వచ్చింది. సమస్యలను త్వరతగతిన పరిష్కరించనున్నట్లు అధికారులు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


కూన శ్రీశైలంగౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న నిజాంపేట వాసులు

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసం వద్ద పలు కాలనీల నుంచి వచ్చిన ప్రజలను ఆయన కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిజాంపేట్‌కు చెందిన పలువురు యువకులు స్థానికంగా రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలి

దుండిగల్: ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని పర్యావరణ ప్రేమికుడు, సామాజిక కార్యకర్త కోలా రవీందర్ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం కాలుషితం అవుతుందన్నారు. కార్యక్రమంలో పి.సురేందర్ రెడ్డి, బసప్ప, శివాజీ తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదు చేస్తున్న రవీందర్ ముదిరాజ్

గుర్తు తెలియని యువతి మృతదేహం



కుత్బుల్లాపూర్: చెరువులో గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లిలోని చెరువులో సోమవారం ఓ మహిళ మృతదేహం తేలిందని స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సదరు యువతి 25 ఏళ్ల వయస్సు ఉంటుందని పేర్కొన్నారు. ఎవరైనా హత్య చేసి చెరువులో పడేశారా..? లేక ప్రమాదవశాత్తు పడిందా..? లేక ఆత్మహత్యకు పాల్పడిందా..? అన్న విషయాలు పోస్టుమార్టం రిపోర్టులో తెలుస్తాయని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో జీహెచ్‌ఎంసీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉన్నాయి. వీటిలో కొన్ని పూర్తయినా వాటిని అందుబాటులోకి తేవడం లేదు. మరికొన్ని చోట్ల పనులు ప్రారంభించిన సదరు కాంట్రాక్టర్లు మధ్యలోనే నిలిపేసి పత్తా లేకుండా పోయినా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

-రంగారెడ్డినగర్

షాపూర్‌నగర్ చౌరస్తాలో ప్రారంభానికి నోచుకోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి



అసంపూర్తి పనులు.. అవస్థలు..!


గిరినగర్‌లో నిలిచిన డ్రైయిన్ పనులు

- కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో నిలిచిన పలు నిర్మాణాలు
- మరోవైపు ప్రారంభానికి నోచుకోని ఫుట్‌ఓవర్ బ్రిడ్జి
- ఇబ్బందుల్లో స్థానికులు, పట్టని అధికారులు

రెండేళ్ల క్రితం షాపూర్‌నగర్, ఐడీపీఎల్ చౌరస్తాల్లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ఐడీపీఎల్ చౌరస్తాలో చేపట్టిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏడాది క్రితం అందుబాటులోకి వచ్చింది. అయితే షాపూర్‌నగర్ చౌరస్తాలోని రూ.1.80 కోట్ల నిధులతో చేపట్టిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు. కొన్నిరోజుల పాటు చిన్నపాటి మరమ్మతులు ఉన్నాయని, మరోసారి ఎస్కలేటర్ బిగించాల్సి ఉందని పేర్కొంటూ అధికారులు దాట వేశారు. ఈలోగా అసెంబ్లీ, మరోసారి లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కోడ్ వచ్చిందని, తరువాత ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అయితే ఎన్నికలు పూర్తయి రెండు నెలలు కావస్తున్నా పాదాచారులకు మాత్రం వంతెనను అందుబాటులోకి తేవడం లేదు. షాపూర్‌నగర్ చౌరస్తా నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇక్కడ జీబ్రా క్రాసింగ్, సిగ్నల్స్ లేకపోవడంతో వాహనాల మధ్య నుంచే ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్నారు.


ఓ పరిశ్రమ గుండా డ్రైయిన్ నాలా వెళ్తున్న దృశ్యం

పిల్లర్ల దశలోనే మహిళా భవనం..

గాంధీనగర్ ప్రధాన రోడ్డులో గతంలో కొనసాగిన అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరడంతో ఏడాది క్రితం సదరు భవనాన్ని కూలివేసి స్థానిక మహిళల ఉపయోగార్థం రూ.25 లక్షలతో మహిళా భవనం నిర్మాణాన్ని చేపట్టారు. అయితే సదరు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పిల్లర్ల వరకే పూర్తి చేసి ఆపై పత్తా లేకుండా పోయాడు. దీంతో ఆర్నేళ్లుగా పనులు ముందుకు సాగడం లేదు. ఇది అందుబాటులోకి వస్తే స్థానిక మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కుట్టు, ఇతర ఉపాధి శిక్షణ కార్యక్రమాలు చేపట్టే వీలు ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

మధ్యలోనే నిలిచిన డ్రైయిన్ నిర్మాణం..

గాంధీనగర్‌లో గిరినగర్‌లో ఇంటి నంబర్ 21–93 నుంచి టెట్రో టూలింగ్ సిస్టం, మండల పరిషత్ పాఠశాల వెనుక గల్లీల గుండా బాక్స్ డ్రైయిన్ పనులకు 2023 జూలైలో రూ.90 లక్షల అంచనా వ్యయంతో సర్కిల్ అధికారులు శ్రీకారం చుట్టారు. ఆ కాంట్రాక్టర్ కూడా కొన్ని రోజుల పాటు నత్తనడకన పనులు సాగించి ఆపై నిలిపివేశాడు. ఈ విషయమై 'సాక్షి'లో కథనాలు ప్రచురితం కావడంతో మళ్లీ పనులు చేపట్టగా స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమ యజమాని తన స్థలం గుండా డ్రైయిన్ నిర్మాణం కొనసాగిస్తున్నారని అడ్డు చెప్పడంతో కొంత మేర డ్రైయిన్‌కు శ్లాబ్ వేయగా మిగితా పనులను అసంపూర్తిగా వదిలేశారు. సదరు పరిశ్రమ యాజమాన్యంతో సర్కిల్ అధికారులు సామరస్యంగా పరిష్కార మార్గాన్ని అన్వేషిస్తే తప్ప పనులకు పట్టిన గ్రహణం వీడే పరిస్థితి కనిపించడం లేదు.

అసంపూర్తిగా నాలా కల్వర్టు విస్తరణ పనులు..

కుత్బుల్లాపూర్ చౌరస్తా నుంచి గ్రామం వరకు కోట్లాది నిధులు వెచ్చించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయానికి ఫర్లాంగు దూరంలోని కల్వర్టు ప్రాంతంలో విస్తరణ చేపట్టలేదు. ఆ ప్రాంతానికి రాగానే రోడ్డు కుచించుకుపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్న విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో స్పందించిన అధికారులు 2 నెలల క్రితం రూ.20 లక్షలతో రోడ్డుకిరువైపులా నాలా కల్వర్టు శ్లాబ్ విస్తరణ పనులను పూర్తి చేశారు. అయితే రక్షణ గోడను ఏర్పాటు చేయకపోవంతో పాటు రోడ్డు వేయలేదు. దీంతో వాహనదారులకు మాత్రం ముప్పు తొలగలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులు సత్వరమే పూర్తి చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.


గాంధీనగర్‌లో పునాది దశలోనే మహిళా భవనం

నేడు కాన్ఫరెన్స్

నిజాంపేట్: నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకుని మంగళవారం ప్రగతినగర్‌లోని ఇన్‌కాయిస్‌లో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఇన్‌కాయిస్ డైరెక్టర్ స్వాగత ప్రసంగం, ఎన్‌ఏఐఎస్ డైరెక్టర్ డాక్టర్ శైలేష్ నాయక్ కీనోట్ ఇవ్వనున్నారు. 11.45 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రస్తుత, వర్తమాన ఉపగ్రహాల ప్రయోగాలు, 12 నుండి 12.15 గంటల వరకు స్పేస్ అప్లికేషన్ ఫర్ ఓషన్స్ అండ్ కోస్ట్, స్పేస్ అప్లికేషన్ ఫర్ క్రైరోస్పేర్, అదే విధంగా యూత్ పోగ్రాంలో భాగంగా 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 8 నుంచి 12 తరగతి విద్యార్థులకు నాలెడ్జ్ రిసోర్స్ సెంటర్‌లో పెయింటింగ్ కాంపిటీషన్, ఈ–క్లాస్ రూమ్‌లో స్పేస్ ఐడియాతన్, ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల వరకు స్పేస్ ఆన్ వీల్స్, ఎగ్జిబిషన్ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

డంప్ యార్డు పరిశీలన

నిజాంపేట్: సీడీఎంఏ వీపీ గౌతం నిజాంపేట్ కార్పొరేషన్‌లోని డంప్ యార్డును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండ్ల నుంచి చెత్త సేకరణ, వీధుల్లో చెత్త తరలింపు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నిజాంపేట్ కమిషనర్ రామకృష్ణరావు, ఇతర విభాగాల అధికారులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

జగద్గిరిగుట్ట: 11 మంది పేకాటరాయుళ్లను బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేసి జగద్గిరిగుట్ట పోలీసులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట పరిధిలోని అస్‌బెస్టాస్ కాలనీ అమ్మ నిలయం పార్కులో సోమవారం కొంత మంది పేకాడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని 11మందిని పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి వారి నుండి రూ.2.36 లక్షల స్వాధీనం చేసుకున్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' విజయవంతం చేయాలి


అధికారులతో సమావేశమైన మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: 'స్వచ్ఛదనం–పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు విజయలక్ష్మి సుబ్బారావు, చిట్ల దివాకర్, సురేశ్‌రెడ్డి, ఆవుల పావని జగన్ యాదవ్, గంగెయ్యల శ్రీనివాస్ యాదవ్, ఆయా విభాగాల అధికారులు,"సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగికి సైబర్ నేరగాళ్ల టోకరా

పోచారం: సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి క్రెడిట్ కార్డు నుంచి డబ్బు కాజేసిన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజు సమాచారం మేరకు... జోడిమెట్లలోని అరుంధతి కాలనీకి చెందిన ధారావత్ వెంకటరామ్(52) ఆర్టీసీలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఇతనికి గత నెల 31న ఇండస్ ఇండ్ క్రెడిట్ కార్డు డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నట్లు ఓ వ్యక్తి ఫోన్ చేసి కార్డ్ ప్రొటెక్షన్ ఇన్సూరెన్స్ తీసుకున్నారా అని అడిగాడు. లేదని సమాధానమిచ్చి ఇన్సూరెన్స్‌ను డీయాక్టివేట్ చేయమన్నాడు. ఇందుకు ఓ లింక్‌ను వెంకటరామ్ ఫోన్‌కు పంపాడు. ఆ లింక్ పైన క్లిక్ చేయగా ఓటీపీ వచ్చింది. దాన్ని ఎంటర్ చేయగానే క్రెడిట్ కార్డు నుండి రూ. 1,47,395.40 డబ్బు డ్రా అవడంతో మోసపోయానని గ్రహించి, సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కిటకిటలాడిన శివాలయాలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: శ్రావణ మాసం మొదటి రోజు ఓల్డ్ బోయిన్‌పల్లిలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం నుంచి శ్రావణమాసం ప్రారంభంకావడంతో స్వామి వారి దర్శనం కోసం క్యూకట్టారు. ఇందులో భాగంగానే ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆర్‌ఆర్‌నగర్, అంజయ్యనగర్, హస్మత్‌పేట, యాదవబస్తీ తదితర ప్రాంతాల శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. శివుడి అభిషేకాలు, రుద్రభిషేకాలు, మహాన్యాసక రుద్రభిషేకాలతో ఆలయాలు మారుమోగాయి. ఆర్‌ఆర్‌నగర్‌లోని శివాలయంలో అభిషేకాలు నిర్వహించి ప్రజలు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నామని స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తెలిపారు.చందుయాదవ్, వెంకట్ యాదవ్ పాల్గొన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: వివిధ సమస్యలపై ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారాన్ని చూపాలని సంబంధిత అధికారులను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. స్టేట్ లెవెల్ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను కూడా సత్వరమే పరిశీలించి పరిష్కరించాలన్నారు. జిల్లా స్థాయిలో పరిష్కారం కాకుండా ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడివుటే అలాంటి దరఖాస్తులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ అర్జీదారుల జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు అందజేశారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ సైదులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 108 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు

కుత్బుల్లాపూర్: చింతల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు కేఎం గౌరీశ్, సురేశ్‌రెడ్డి 247 మంది లబ్ధిదారులకు రూ.90 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదల్లో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపశమనాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ధూలపల్లి మాజీ సర్పంచ్ చింతల దేవేందర్‌యాదవ్, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, జగద్గిరిగుట్ట వేంకటేశ్వర దేవస్థానం చైర్మన్ వేణుయాదవ్, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేశ్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయరామ్‌రెడ్డి, పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, దేవరకొండ శ్రీనివాస్, సీనియర్ నాయకులు రఫీ, కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, రవికాంత్, బండారి మహేశ్, వెంకటస్వామి, దొడ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

నియామకం


విజయకేతనం చూపిస్తున్న శరత్‌కుమార్, ప్యానల్ సభ్యులు

నిజాంపేట్: నిజాంపేట్ పూజిత ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గంట శరత్‌కుమార్ ఎన్నికయ్యారు. కాలనీ అసోసియేషన్ భవనంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో శరత్ కుమార్ ప్యానల్‌కు చెందిన తొమ్మిది మంది అభ్యర్థులు విజయం సాధించారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయనను కాలనీ సభ్యులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

వనాల పెంపుతోనే మానవ మనుగడ


సుభాష్‌నగర్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వివేకానంద్, ఉప కమిషనర్ నర్సింహ

వనాల పెంపుతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. 'స్వచ్ఛదనం–పచ్చదనం' లో భాగంగా సుభాష్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే సోమవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ నర్సింహ, ఏఎంహెచ్‌ఓ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు, గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్లల్లో ప్రజాప్రతినిధులు, స్థానిక సంక్షేమ సంఘాలు పాల్గొని మొక్కలు నాటారు. -కుత్బుల్లాపూర్


దుండిగల్‌లో కౌన్సిలర్ కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో..


కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మొక్కలు పంపిణీ చేస్తున్న చైర్మన్, కమిషనర్


జగద్గిరిగుట్టలో కార్పొరేటర్ జగన్ ఆధ్వర్యంలో ర్యాలీ..


ప్రగతినగర్‌లో మేయర్ నీలారెడ్డి..


దేవేందర్‌నగర్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న ఉపకమిషనర్